క్లుప్తంగా

శాస్త్రవేత్తకు గుర్తింపు



చంద్రబాబునాయుడు

కాశినాయన: మండలంలోని ఇటుగుల్లపాడు గ్రామానికి ఆచార్య కడియాల చంద్రబాబునాయుడు మెటీరియల్ సైన్స్ విభాగంలో పరిశోధనలు చేస్తూ వరుసగా నాలుగోసారి అగ్రశ్రేణి శాస్త్రవేత్తగా గుర్తింపు పొందారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఆయన అమెరికాలో సాఫ్ట్‌వేర్ విశ్వవిద్యాలయం ప్రకటించిన ప్రపంచ అగ్రశ్రేణి శాస్త్రవేత్తల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఆయన సమర్పించిన పరిశోధన పత్రాలకు ప్రపంచంలోనే అత్యధిక ప్రజాదరణ లభించడంతో ఈ ఆదరణ దక్కింది. 2020, 2021, 2022, 2023లోనూ అగ్రశ్రేణి శాస్త్రవేత్త జాబితాలో చోటు సంపాదించుకున్న ఆయనను పలువురు అభినందించారు. ప్రస్తుతం ఈయన బెంగుళూరు గీతం విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

రైతులు బిజీబిజీ



శనగ సాగుకు సిద్ధంగా ఉన్న పొలాలు

రాజుపాళెం: రబీ సీజన్ ప్రారంభవడంతో శనగ పంట సాగు చేసే రైతులంతా ఎరువులు వేయడంలో బిజీ అయ్యారు. ఈ ఏడాది పత్తికి ప్రత్యామ్నాయంగా రైతులు చాలా వరకు శనగపై దృష్టి సారించారు. రైతు భరోసా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసిన రైతులకు ఏఓ శివరామ కృష్ణారెడ్డి విత్తనం రాయితీపై అందిస్తున్నారు. పదునైన వర్షం పడితే శనగ విత్తనసాగు పెరుగుతుందని, ఇప్పటికే 12 వేల ఎకరాల్లో పంట సాగైందని ఏవో తెలిపారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

ప్రొద్దుటూరు: స్థానిక సున్నంబట్టీ వీధిలో మురికి నీళ్లు వస్తున్నాయని అక్కడి ప్రజలు కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషాకు ఆదివారం విన్నవించారు. స్పందించిన ఆయన వెంటనే మున్సిపల్ అధికారులతో మాట్లాడి ట్యాంకరుతో నీటిని సరఫరా చేయించారు. పైపులైన్ లీకేజీని గుర్తించి మరమ్మతులు చేయించారు.

రూ.26వేల వేతనం ఇవ్వాలి

ప్రొద్దుటూరు: ఆశా వర్కర్లకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆశా వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. ఆదివారం సెలవు లేదని, బంధువు చనిపోతే సెలవు ఇవ్వడం లేదన్నారు. ఈ సమావేశంలో శేఖర్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

చాపాడు: మండలంలోని కాశినాయన వృద్ధాశ్రమంలో వృద్ధులకు చాపాడు పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి మాచనూరు రాఘవయ్య ఆదివారం అన్నదానం చేశారు. ఆయన కుమారుడు శివతేజ్ జన్మదినం సందర్భంగా ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న రామఅనిల్‌కుమార్‌రెడ్డి

మైదుకూరు: ఎస్ఎల్ఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నంద్యాల రోడ్డులోని వీఆర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రజలకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మైదుకూరు నియోజకవర్గంలో ప్రతి ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఎల్ఆర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ రామ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కరస్పాండెంట్ వెంకటరాముడు, శ్రీనివాసులు, తిరుమలేసు, చెన్నకేశవ, రాము పాల్గొన్నారు.

నవోదయ గ్రాండ్ టెస్ట్



నవోదయ గ్రాండ్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం నవోదయ గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల మండలాలకు చెందిన 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్టీయూ రీజనల్ కన్వీనర్ పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులకు నవోదయపై అవగాహన కల్పించేందుకు, పోటీతత్వం పెంచేందుకు ఈ పరీక్ష నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జయరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, రమణారెడ్డి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌పై ఉక్కుపాదం

ప్రొద్దుటూరు క్రైం: క్రికెట్ బెట్టింగ్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపారు. పలు ప్రాంతాల్లోని లాడ్జీలు, ఇతర ప్రాంతాల్లో ఆదివారం సోదాలు జరిపారు. ప్రొద్దుటూరులో ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు క్రికెట్ బెట్టింగ్, మట్కాపై సీఐలు రాజారెడ్డి, ఇబ్రహీం, నారాయణయాదవ్, రమణారెడ్డి, సిబ్బంది చర్యలు చేపట్టారు. లాడ్జిలో తనిఖీలు చేసి రిజిష్టర్లు పరిశీలించారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్లకు తరలించారు. కడప స్పెషల్ పార్టీ, ప్రొద్దుటూరు పోలీసులు బృందాలుగా ఏర్పడి పలు చోట్ల క్రికెట్ బుకీల ఇళ్లలో సోదాలు చేశారు. కొందరిని అదుపులోకి తీసుకుని ఎస్పీ ఎదుట హాజరు పరిచారు. క్రికెట్ పందేలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పోరుమామిళ్లలో

పోరుమామిళ్ల: పోరుమామిళ్లలో సీఐ చిరంజీవి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. లాడ్జీల్లో బస చేసిన వారి వివరాలు తీసుకున్నారు. లాడ్జి యజమానుల వారి వివరాలు రిజిష్టర్‌లో నమోదు చేసి పూర్తి ఆధారాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రజుమంలో కలసపాడు ఎస్ఐ నాగమురళి, కాశినాయన ఎస్ఐ హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మైదుకూరులో సెల్ ఫోన్లను తనిఖీ చేస్తున్న అర్బన్ సీఐ మస్తాన్



లాడ్జీలో దిగిన వ్యక్తులతో మాట్లాడుతున్న సీఐ

మైదుకూరులో

మైదుకూరు: మైదుకూరులో లాడ్జిలలో, అనుమానం ఉన్న ప్రదేశాల్లో అర్బన్ సీఐ ఏపీ మస్తాన్ సోదాలు జరిపారు. అనుమానాస్పద వ్యక్తులు వచ్చినప్పుడు తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

బద్వేల్‌లో

బద్వేల్ అర్బన్: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని అర్బన్ సీఐ పి.యుగంధర్ హెచ్చరించారు. ఎస్పీ సిద్దార్థ్‌కౌశల్ ఆదేశాల మేరకు మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ పర్యవేక్షణలో ఆదివారం పట్టణంలోని లాడ్జీలు, బుకీల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్ నిర్వహించినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

రాజుపాళెం: పల్లెల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు సోమవారం నిర్వహించనున్నారు. మండలంలోని గాదెగూడూరులో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ పోలా వరలక్ష్మి, వెంకటరెడ్డి తెలిపారు. ప్రత్యేక వైద్యులు వస్తారని, రోగులు వచ్చి చికిత్స చేయించుకోవాలని సూచించారు.

కాశినాయన: మండలంలోని సావిశెట్టిపల్లెలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మైథిలి తెలిపారు. సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

చాపాడు: మండలంలని సోమాపురం సచివాలయం సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తారని ఆయన పేర్కొన్నారు. గ్రామస్తులు వినియోగించుకోవాలని వైద్యాధికారి కోరారు.

రేపు బ్రాహ్మణపల్లెలో

గోపవరం: మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు వైద్యులు వద్ద రక్త, షుగర్ పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులను పొందాలన్నారు.

చిన్నదండ్లూరులో నాకా బందీ

ఎర్రగుంట్ల: చిన్నదండ్లూరులో ఆదివారం తెల్లవారుజామున కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో పలువురి ఇళ్లలో తనిఖీలు నిర్వహించి, గడ్డివాముల్లో సోదాలు చేశారు. ఇరువర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

జూదరుల అరెస్టు

ఎర్రగుంట్ల : పోట్లదుర్తి ఎస్సీ కాలనీ సమీపంలో ఆదివారం కంపచెట్లలో పేకాట ఆడుతున్న ఆరు మంది జూదర్లను అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ.9వేలు నగదును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

బీజేపీ కుట్రతో రాష్ట్రానికి అన్యాయం

- సీపీఐ జిల్లా నాయకులు రామయ్య
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రొద్దుటూరు: తెలంగాణలో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న బీజేపీ కుట్రతో రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య తెలిపారు. స్థానిక గీతాంజలి హైస్కూల్‌లో కృష్ణానది నీటి వివాదంపై సీపీఐ సహాయ కార్యదర్శి షరీఫ్ అధ్యక్షతన ఆదివారం రౌండ్ టేబుల్‌సమావేశం జరిగింది. రామయ్య మాట్లాడుతూ అంతర్ రాష్ట్ర నదీ వివాదాల చట్టం 1956 ప్రకారం కృష్ణానది నీటి వివాదంపై ఏర్పాటైన బచావత్ ట్రిబ్యునల్ 75 శాతం నీటి లభ్యత ఆధారంగా 2,130 టీఎంసీలుగా లెక్కకట్టిందన్నరు. అందులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీలు, మహారాష్ట్రకు 525 టీఎంసీలు, కర్ణాటకకు 734 టీఎంసీలు కేటాయిస్తూ మిగులు జలాలను వాడుకునే వెసులుబాటును దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు కల్పిస్తూ తీర్పు చెప్పిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నీటిని పునఃపంపిణీ పేరుతో బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు 448 టీఎంసీలుగా లెక్కకట్టి మూడు రాష్ట్రాల మధ్య పంపిణీ చేస్తోందన్నారు. ఇలా చేస్తే గాలేరు–నగరి, హంద్రీ–నీవా, వెలుగొండ, తెలుగుగంగ ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుందన్నారు. కేసు విచారణలో ఉండగానే బీజేపీ ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలు చేసి అందలమెక్కాలని చూస్తోందని విమర్శించారు. ఈ విషయంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మొయినుద్దీన్, ప్రసాద్, పద్మ, ఎల్లయ్య మాదిగ, శ్రీను, దస్తగిరి, శివారెడ్డి, గురుస్వామి, ప్రతాప్‌రెడ్డి, ఓబన్న, పల్లవోలు రమణ, నారాయణ, సందీప్, నరసింహులు, శేఖర్, కుమార్ పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్‌సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య

నోటిఫికేషన్ రద్దు చేయాలి

మైదుకూరు: కృష్ణా జలాల పంపిణీ నోటిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కృష్ణా జలాల పునః పంపిణీపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం స్థానిక హైస్కూల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ కృష్ణా నీటి కేటాయింపుల పంపిణీని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు అధికారం కల్పిస్తూ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని సీపీఐ వ్యతిరేకిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి అఖిలపక్షంతో ఢిల్లీలో పోరాటం చేయాలన్నారు. పి.శ్రీరాములు, ఏవీ శివరాం, పి.భాస్కర్, బీవీ శ్రీనివాసులు, సీపీ.పుల్లయ్య, వెంకట రమణయ్య పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తా

ప్రొద్దుటూరు కల్చరల్: దివ్యాంగుల సంక్షేమానికి సహాయ సహకారాలు అందిస్తానని కొత్తపల్లె సర్పంచి కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ డే ఆఫ్ సైన్ ల్యాంగ్వేజ్ సందర్భంగా స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని మహిళా స్వశక్తి భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం కడప డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందించిన చెవిటి మిషన్లను బధిరులకు అందించారు. ఈ కార్యక్రమంలో వెల్లాల భాస్కర్, లక్ష్మీకిశోర్, సాయి సందీప్‌కుమార్, ఇర్ఫాన్, సత్యనారాయణ రావు, షాకీర్‌హుసేన్, తదితరులు పాల్గొన్నారు.



వినికిడి యంత్రాలను అందిస్తున్న శివచంద్రారెడ్డి

సేవా దృక్పథం అభినందనీయం

కడప కల్చరల్ : ఆశారేఖ ఫౌండేషన్ చైర్మన్ నెమలిదిన్నె నాగవేణి సేవాభావం అభినందనీయం అని సోషల్ వెల్ఫేర్ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. ఆదివారం చెన్నూరు బస్టాండులోని రామకృష్ణమఠంలో నెమలిదిన్నె నాగవేణి ఆధ్వర్యంలో 100 మంది మూగ, బధిర, అంధ బాలికలు, బాల వికాస్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ బాలికలు, మహిళా క్యాడెట్లకు ప్రశంసాపత్రాలు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వల్లూరు బ్రహ్మయ్య పాల్గొని ప్రశంసాపత్రాలను, బహుమతులను అందజేశారు. ఆశారేఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని సేవా కార్యక్రమాల్లోనూ ఈ చిన్నారులు క్రమం తప్పకుండా పాల్గొంటూ తమవంతు సహకారం అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడికి సన్మానం

బ్రహ్మంగారిమఠం: ఏపీ ఔట్ సోర్స్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిని బి.మఠంలోని కృష్ణదేవరాయ బలిజ కాపు తెలగ అన్నదాన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ బలిజ సంఘం సభ్యులు ఐక్యంగా బ్రహ్మంగారి మఠంలో అన్నదాన సత్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్‌గా ఉన్న తనకు రాష్ట్ర స్థాయిలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా స్థానం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో గోపిశెట్టి పిల్ల నారాయణ, బొల్లి సిద్దయ్య, నారాయణ స్వామి, శ్రీరాములు, కొండయ్య, రామయ్య, సుబ్బరాయుడు, అమ్మిశెట్టి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

నీటి సరఫరాలో అంతరాయం

జమ్మలమడుగు : పట్టణంలో 12, 13వ తేదీల్లో మైలవరం జలాశయం దొమ్మరనంద్యాల సమీపంలో ఉన్న నీటి సరఫరా చేసే సంప్‌ను శుభ్రం చేస్తుండటంతో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నవరాత్రి ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

కడప కల్చరల్ : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు కేవలం ఐదు రోజులే గడువు ఉంది. దీంతో ఉత్సవాలు నిర్వహించే ఆలయాలలో సన్నాహాలు మొదలయ్యాయి. పందిళ్లు, ఇతర ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. దసరా పండుగ అనగానే సరదాలు, సందళ్లు గుర్తుకొస్తాయి. ప్రొద్దుటూరు తర్వాత జిల్లాలో కడప నగరంలో అంత భారీ స్థాయిలో దసరా పండుగను నిర్వహిస్తారు. శ్రీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయం(అమ్మవారిశాల)లో ఈ పండుగను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు ప్రారంభించారు. ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను రప్పించి వారం క్రితం నుంచే భారీ పందిళ్ల నిర్మాణం మొదలెట్టారు. నగరంలోని ఇతర అమ్మవారి దేవాలయాలలో కూడా ఉత్సవాల నిర్వహణకు సన్నాహాలు ప్రారంభించారు. పెద్ద ఆలయాలలో ఇప్పటికే నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసుకున్నారు. వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి గనుక ప్రజలకు ఇబ్బంది లేకుండా పందిళ్లకు దిగువన ప్లాస్టిక్ షీట్లు ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాదు, విజయవాడ, చెన్నై, బెంగుళూరు తదితర పెద్ద నగరాల నుంచి ఉత్సవాలకు సంబంధించి కార్యక్రమాలను రోజువారి వివరాలతో రంగురంగుల బుక్‌లెట్లను ముద్రింపజేశారు. ఆ బుక్‌లెట్లు ఇప్పటికే ఆయా ఆలయాలకు చేరుకున్నాయి. బుక్‌లెట్లను అందజేసి వారి పేరిట నిర్వహించనున్న పూజకు హాజరు కావాలని చెబుతున్నారు.

ముగిసిన ఉత్సవాలు



ఉత్సవాలలో పాల్గొన్న క్రైస్తవులు

పోరుమామిళ్ల: పట్టణంలోని ఆర్‌సీయం చర్చి ఆవరణలో జపమాలరాజ్ఞి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా విజయభాస్కర్, రాజేంద్ర ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిపారు. శనివారం రాత్రి కడప మేత్రాసన కథోలిక పీఠాధిపతి గాలిబాలి పాల్గొని ప్రజలకు సందేశమిచ్చారు.ఈ సందర్భంగా పుల్లయ్య, ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన చెక్కభజన, కులుకు భజన, కోలాటం ఆకట్టుకున్నాయి. పోరుమామిళ్ల క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

కడప ఎడ్యుకేషన్: కడప రిమ్స్‌రోడ్డులోని స్పిరిట్ కాలేజీలో నవభారత్ ఫర్టిలైజర్స్ లిమిటెట్ వారు సేల్స్ రెప్రజెంటేటివ్స్ ఉద్యోగాలకు సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపికలు నిర్వహిస్తారని ఆ కళాశాల డైరెక్టర్ రవీంద్ర తెలిపారు. అభ్యర్థులు 19 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగి ఏదైనా డిగ్రీ చదివి ఉండాలని తెలిపారు. ఎంపికలకు వచ్చే అభ్యర్థులు తమ వెంట బయోడేటా, సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. మిగతా వివరాలకు కాలేజీ ప్లేస్‌మెంట్ అధికారి మునీర్ 98852 50955 నెంబర్‌ను సంప్రదించాలని డైరెక్టర్ రవీంద్ర తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్నే అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

బద్వేలు అర్బన్: పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఎస్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి అన్నారు. స్థానిక గాయత్రి జూనియర్ కళాశాల ఆవరణలో రీజనల్ కన్వీనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన బద్వేలు రీజియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బాలగంగిరెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ఎస్టీయూ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్‌కుమార్, చంద్రశేఖర్, పి.వి.క్రిష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రహాసరెడ్డి, ఎస్.వెంకటసుబ్బయ్య, పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలు యూటీఎఫ్‌కే సాధ్యం



మహాసభలో మాట్లాడుతున్న లక్ష్మీరాజ

పోరుమామిళ్ల: ఉపాధ్యాయుల సమస్యలపై సమరశీల పోరాటాలు చేయడం, అలుపెరగని ఉద్యమాలు చేయడం యూటీఎఫ్‌కే సాధ్యమని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు నాయబ్‌రసూల్ అధ్యక్షతన పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాంతీయ మహాసభలు జరిగాయి. లక్ష్మీరాజ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడి 50 ఏళ్లు కావడంతో స్వర్ణోత్సవాలు జరుపుతున్నామని తెలిపారు. ప్రాథమిక విద్యకు పాతర వేస్తే ప్రభుత్వంపై ఉద్యమాలు తీవ్రం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, మహేష్‌బాబు, జయరామయ్య, చెన్నయ్య, అహమ్మద్, ప్రభాకర్, కృష్ణయ్య, ఈశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, భైరవప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

డేవిడ్‌రాజ్ సేవలు అభినందనీయం

జాతీయ తపాలా ఉద్యోగుల కార్మిక సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి శివాజీ

ప్రొద్దుటూరు కల్చరల్: జాతీయ తపాలా ఉద్యోగుల కార్మిక సంఘ ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన పీఎస్ డేవిడ్‌రాజ్ సేవలు అభినందనీయమని జాతీయ తపాలా ఉద్యోగుల కార్మిక సంఘాల సమాఖ్య(ఎఫ్ఎన్‌పీఓ) ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి శివాజీ అన్నారు. స్థానిక గోల్డెన్ పార్కులో ఆదివారం జరిగిన డేవిడ్‌రాజ్ అభినందన సభలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ నుంచి తొలిసారి తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన వ్యక్తి డేవిడ్ అని కొనియాడారు. పోస్టల్ సూపరింటెండెంట్ జి.కిరణ్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, ప్రయోజనాలకు అనేక పోరాటాలు, ధర్నాలు చేశారన్నారు. డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ తపాలా ఉద్యోగుల సంక్షేమానికి, పాత పెన్షన్ అమలు కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం డేవిడ్‌రాజ్ దంపతులకు పలువురు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ సుబ్బరాయుడు, ఎన్‌యూ జీడీఎస్ రాష్ట్ర కార్యదర్శి యోగేశ్వరరావు, గురుదాస్, కృష్ణప్రసాద్, సుభాన్, అమర్, చినబాబు, తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.



డేవిడ్‌రాజ్ దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

ఉత్సవ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

మైదుకూరు: మైదుకూరు మత్కన్యకాపరమేశ్వరి ఆలయంలో విజయదశమి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు సూరిశెట్టి శివవెంకటప్రసాద్ కోరారు. స్థానిక అమ్మవారిశాలలో ఉత్సవ ఆహ్వాన పత్రికలు ఆయన ఆవిష్కరించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించిందని తెలిపారు. రోజూ అమ్మవారికి విశేష అలంకారాలు, పూజలు, నవగ్రహ జపాలు, రుద్రాభిషేకాలు, చండీ హోమాలు జరుపుతామని తెలిపారు. గ్రామోత్సవంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షుడు యలవలి హరికిషన్, దొంతు వెంకటసుబ్బయ్య, దరిశ సునీల్, మిట్టా సురేష్, కోశాధికారి ఎలిశెట్టి గురుప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సభ నాయకులు

29న ప్రొద్దుటూరులో హాఫ్ మారథాన్



మారథాన్‌కు సంబంధించిన మెడల్స్, టీషర్ట్స్‌ను విడుదల చేస్తున్న రామనాథరెడ్డి, తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్: జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరులో ఈ నెల 29న ఉదయం ఆరు గంటలకు హాఫ్ మారథాన్–2023 నిర్వహించనున్నట్లు ఐఆర్ఎస్ అధికారి ఉండేల రామనాథరెడ్డి తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో జరిని కార్యక్రమంలో క్రీడాకారుల టీ షర్ట్స్, మెడల్స్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని 2023 ఐరన్ మ్యాన్ రన్ ఫర్ యూనిటీని రాయల్ కౌంటీ బైపాస్ వద్ద నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. దీంతోపాటు ఐదు, పది, 21.1 కిలోమీటర్ల పరుగు పందెం నిర్వహిస్తామని, ఎవరైనా పాల్గొనవచ్చునని తెలిపారు. 5 కిలోమీటర్ల పందెం విజేతలకు వరుస బహుమతులుగా రూ.7 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు, పది కిలోమీటర్ల విజేతలకు రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, 21.1 కిలోమీటర్ల విభాగంలో విజేతలకు రూ.21 వేలు, రూ.16 వేలు, రూ.10 వేలు ఇస్తామని తెలిపారు. పాల్గొనే క్రీడాకారులందరికీ టీ షర్ట్స్, నిర్దేశిత దూరం పూర్తిచేసిన వారికి మెడల్స్, ప్రశంసాపత్రం అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 15వ తేదీలోగా పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేవాంష్ ట్రస్ట్ కోశాధికారి వద్ది మురళి, కోనేటి సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రవిశంకర్, శివారెడ్డి, పాల్గొన్నారు.

అటవీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కడప కోటిరెడ్డి సర్కిల్/అర్బన్: విశ్రాంత అటవీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర విశ్రాంత అటవీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్‌వీఎస్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో కడప అటవీ అతిథిగృహ ఆవరణంలో సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత అటవీ ఉద్యోగులకు చాలామందికి పించన్లు అందడం లేదని, అలాగే వారికిఆర్థిక బెనిఫిట్లు రావడం లేదని తెలిపారు. ఈసమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తుందన్నారు. అనంతరం 70 సంవత్సరాలు దాటిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్రరావు, కార్యదర్శి గాలిబ్, రాష్ట్రకోశాధికారి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో నృత్యాలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా చిన్నారుల నృత్య ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. కమలాపురానికి చెందిన కిశోర్ డ్యాన్స్ అకాడమి విద్యార్థులు ఈ సందర్భంగా ప్రముఖ సినీ గీతాలతో పాటు శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. ప్రేక్షకులు కరతాళ ధ్వనులు చేసి వారిని ప్రోత్సహించారు. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ పి.శివప్రసాద్‌రెడ్డి పాల్గొని పర్యవేక్షించారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన